# 'పెనుభూతం'

మా యిల్లు రెండురోడ్లు కలిసిన వొక మూలవుంది. యింటికి ముందున్న రోడ్డుకి యిరు ప్రక్కలా జట్కాబళ్ళూ, సైకిల్ రిక్షాలూ, ఎక్కువ ఎక్కువగా నిలబడివుంటై. వొకటి రెండుసార్లు పోలీసులు సౌకర్యం కలిగించుకొని, బళ్ళు అక్కడ నిలవవద్దని జట్కాబళ్ళవాళ్ళనీ, రిక్షాబళ్ళ వాళ్ళనీ చెదిరిపోయేటట్టు కొట్టనుకూడా కొట్టారు. కాని రేగిన తేనెటీగలకు మల్లే వాళ్ళు కాసే ఇక్కడక్కడే రౌండ్లు కొట్టి, నెమ్మదిగా ఒకరితర్వాత ఒకరు మళ్ళీ వారి వారి పూర్వస్థానాలకు చేరుకున్నారు. వీళ్ళవల్ల మాకు చీదర కలిగేమాట నిజమే. అయినప్పటికీ పోలీసులతో చెప్పిందానికంటే సహించటమే మంచిదని అనుభవంవల్ల గ్రహించి వాళ్ళని అక్కడనుంచి తోలివేయించలేదు నేను.... దీనికి కారణం వొకటే. బళ్ళనేవి బాడుగ వొచ్చే వరకూ ఎక్కడో ఒకచోట నిలిచివుండాలి. అస్తమానం రోడ్లుపట్టుకు తిరుగుతూ వుండలేవు. ఆ నిలిచే స్థలంకూడా పదిమంది వొచ్చే స్థలంగా వుండాలి. ఏదో వొక మారుమూలైతే లాభంవుండదు. ఇటువంటి స్థలాలు మ్యునిసిపాలిటీవారుగానీ, ప్రభుత్వంగాని నిర్దేశించలేదు. అందుకని బళ్ళని మా యింటిముందు లేకుండా చేసినా, అవి యెవ్వరో వొకరి ఇంటిముందు నిలవవలసిందే. మా ఇంటిముందునుంచి మరొకరి ఇంటిముందుకు తోలటం నాకేమంత సదుద్దేశంగా కనపడక నేను చూచీ చూడనట్టు వూరుకున్నాను.

ఒకరోజు నేను యింటిముందు గదిలో మిత్రులతో మాట్లాడుతూ వుండగా, వొక జట్కాబండి వచ్చి యింటి ముందు ఆగటం, ఆ జట్కాబండివాడు బండిలోనుంచి దిగిన ప్రయాణీకునితో పోట్లాడటం వినిపించింది అది మద్రాసు రైలు వచ్చే టైము. ఎవ్వరో మా యింటికి ఆ బండి దిగివచ్చి ఉంటారు. బండివాడు వాడితో తగాదా పెట్టుకున్నాడు. జట్కాబళ్ళ వాళ్ళ తగాదా ఏ విధంగా నడిచేదీ అందరికీ తెలిసిన విషయమే. చివ్వరికి 'ఇది

యెప్పుడైనా బండిహెక్కిన మొహమేనా?' తో అంతమవుతుంది. ఏ బంధువుని, ఏ పెద్దమనుష్యుని పట్టుకొని ఈ మాటలు అంటున్నాడో అని నేను బయటకు వచ్చాను. బయటకువచ్చి చూద్దునుగదా, ఒక ట్రంకుపెట్టే వొక మూటా పట్టుకొని క్రిష్ణనాయరు నుంచోని వున్నాడు. అతని పక్కనే వొక ఆడమనిషి నుంచొని వుంది, అతని భార్య అయివుంటుంది. వాళ్ళే బండి దిగిన ప్రయాణీకులు. వాళ్ళతో పోట్లాడుతున్నాడు బండివాడు. బండికి రావలసిన బాడుగను గురించి.

క్రిష్ణనాయర్‌ని నేను మద్రాసులో వుండగా యెరుగుదును.మాఇంట్లో రెండుమూడు నెలలు వంటకూడా చేశాడు. తరువాత సినిమా ప్రొడక్షన్‌లో జేరాడు. వొకరోజు వచ్చి తనపని ఇప్పుడు బాగుందనీ, ఎవర్నో పెళ్ళిచేసుకొని దానితో కాపురం పెట్టాననీ చెప్పాడు. బహుశా, వాడిప్రక్కనవున్నది ఆ మనిషే అయివుంటుంది. అయితే అతను ఇప్పుడు ఇక్కడికి యెందుకు వచ్చినట్లు? క్రిష్ణనాయర్ నన్నుచూచి, బండివాడితో తగాదా పెట్టుకోవటం ఇష్టంలేకవాడు అడిగినంతా యిచ్చివేశాడు. ట్రంకుపెట్టే మూటా చెరొక చేత్తోపట్టుకొని భార్య వెనకరాగా యింటిలోకి వచ్చాడు.

"ఎక్కడనుంచిరా" అని అడిగాను.

"మెడ్రాసునుంచి" అన్నాడు.

అతడు వచ్చినరీతిక నాకు ఆశ్చర్యంగానేవుంది. ఇంచు మించుదగ్గర బంధువు దిగినట్లు దిగాడు. ఈ ఆశ్చర్యాన్ని మాత్రం నేను పైకి కనపడనివ్వలేదు. "అమ్మవున్నది లోపలకు వెళ్ళు" అన్నాను.

వాడు భార్యాసమేతంగా లోపలకు వెళ్ళాడు. పెట్టేమూటా మాత్రం ఆఫీసుగదిలో పెట్టాడు.

వాడేదో నౌకరీకి ఒచ్చి వుంటాడని నేను మనస్సులో తేల్చుకున్నాను. కాని వాడి పద్ధతిమాత్రం నాకు బొత్తిగా నచ్చలేదు. అసలిక్కడ నౌకరీ దొరుకుతుందో దొరకదో ముందు వొక ఉత్తరం వ్రాసి వుండవలసింది. పోనీ ముందుతాను వచ్చి, నౌకరీ వొచ్చింతర్వాత భార్యని తెచ్చు

కోవలసింది. అదేదీలేదు. ఏకాయెకిని భార్యా సమేతంగా వచ్చి వేశాడు. వీళ్ళని ఏం చేసేటట్టు?

నే నీ విధంగా ఆలోచిస్తూ వుండగా లోపలనుంచి నా భార్య వొచ్చింది.

"చూశాగా, క్రిష్ణనాయర్ వచ్చాడండి" అన్నది.

"చూడకేం? నేనే ఆహ్వానించాను" అన్నాను.

"పాపం చిక్కి సగమైనాడు. మద్రాసులో వున్నప్పుడే బాగా బలిసి వుండేవాడు." అన్నది.

నేను ఊరుకున్నాను. కాసేపువుండి "ఎందుకువచ్చాడో" అని అడిగాను.

"ఏదో పాపం అక్కడ జరుగుబాటుకికూడా ఇబ్బంది అయి వుంటుంది. ఎరిగిన వాళ్ళం మనం ఉన్నాంగదా ఏదో వొకటి చూపించలేక పోతామాఅని వచ్చి వుంటాడు." అన్నది నా భార్య.

"మరిప్పుడేం చెయ్యాలి!"

"చేసేది ఏముంది? ఎక్కడైనా ఉద్యోగం చూడండి. చేసిన సహాయం ఊరికే పోదు" అన్నది నా భార్య.

"ఉద్యోగం! దొరికేదాకా?" అని అడిగాను.

"వాళ్ళకిమాత్రం ఈ ఊళ్లో ఎవరు వున్నారు? ఇక్కడే వుంటారు. వాళ్ళకిమాత్రం ఏం కావాలి? గుప్పెడు మెతుకులేగా!" అన్నది నా భార్య.

* * * *

క్రిష్ణనాయర్ కి అదృష్టవశాత్తూ ఉద్యోగం తొందరలోనే దొరికింది. మా యింటికి వచ్చిన నాలుగోరోజు ఉద్యోగంలో ప్రవేశించాడు. దానికి తగినట్లుగా అద్దెకు ఒక ఇల్లుకూడ దొరికింది. వెంటనే భార్యనుతీసుకొని

ఆ ఇంట్లో ప్రవేశించాడు. తరువాత వాళ్ళు అప్పుడప్పుడూ మా ఇంటికి వచ్చి పోతుండేవారు. వాడువచ్చి అవసరమైన యింటిపనులు ఏమన్నా వుంటేచేసి వెళుతూ వుండేవాడు. అది సాయంకాలంపూట. వచ్చి పిల్లల్ని పార్కుకి తీసుకువెళ్ళి, కాసేపు ఆడించి ఇంటిదగ్గర దింపి వెళ్తుండేది. నేనుమాత్రం వాళ్ళసంగతి ఎక్కువపట్టించుకునేవాణ్ణి కాదు. డబ్బు లేదంటే వొక పదిరూపాయలు యిచ్చి, జీతం రాగానే యిచ్చే ఒప్పందంమీద ఒక నెలకు సరిపోయేటట్టు వెచ్చాలు యిప్పించి చేతులు కడుక్కున్నాను.

ఇలా వుండగా నేను మద్రాసు వెళ్ళవలసి వచ్చింది. అది కోర్టు వ్యవహారం. నాలుగైదు ఏళ్ళకిందట మేము సినిమా తీద్దామని ఒక కంపెనీ పెట్టాం. అందులో నేనుకూడా ఒక షేరుహోల్డరుగా వున్నాను. ఆ సినిమా తీసే స్థితికి రాకముందే కంపెనీవ్యవహారాలు కోర్టుకెక్కినై. ఆ సందర్భంలో మద్రాసు వెళ్ళాను. తీరా డబ్బుఖర్చుపెట్టుకొని అక్కడకు వెళ్ళేటప్పటికి కేసు వాయిదాపడింది. చేసేదిలేక దేవుడికి కట్టుకునే ముడుపు దేవుడికి కట్టుకొని, పూజారికి సమర్పించుకోవలసిన కానుక పూజారికి సమర్పించుకొని, అక్కడ నాకు మిత్రుడైన వొకకళా దర్శకుడు వుంటే అతన్ని చూచి వద్దామని వెళ్ళాను.... నేను వెళ్ళేటప్పటికి అతను అప్పుడే షూటింగునుంచి తిరిగి వచ్చాడు. అతనిలోపాటు నేను ఎరిగిన వొక యాక్టరుకూడా వుండటం తటస్థించింది. మేము కాసేపు సినిమా పరిశ్రమ స్థితిగతులూ, చిత్రాల క్వాలిటీ, డైరెక్టర్ల యొక్క, సినిమారచయితల యొక్క వైఖరులూ మొదలైనవి తిరగవేశాము. చివరకి నా మిత్రుడు "క్రిష్ణనాయర్ నీ దగ్గరకు వచ్చాడా?" అని అడిగాడు.

నేను వాడి పరిస్థితి చెప్పి, "నా దగ్గరకు వచ్చినట్లు నీకెట్లా తెలుసు?" అని అడిగాను.

"పంపింది నేనే." అన్నాడు మిత్రుడు. అని వాడిసంగతి సందర్భాలు చెప్పాడు. వాడితో వచ్చిన ఆడమనిషి పేరు రంగనాయకి అట. రంగనాయకి తనఇంట్లో అంట్లుతోముతూ వుండేదట. అప్పుడు కలిసిందట క్రిష్ణనాయర్కీ, దానికీ. రంగనాయకితండ్రి ఎప్పుడో లేచివచ్చి మద్రాసులో నిల

బడిపోయిన తెలుగువాడట. చాలా అభిమానస్తుడట. అతనికి తన కూతురు వంటచేసుకు బ్రతికే మళయాళపువాడిని పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదట. అయినా తండ్రిమాటలెక్క పెట్టకుండా రంగనాయకి క్రిష్ణనాయర్ నే పెళ్ళిచేసుకుని యితనితోనే వుందట. అమితఅభిమానస్తుడైన రంగనాయకి తండ్రి తన కూతురు తన యింటిమీదకి తెచ్చిన అవమానాన్ని సహించలేక దిగులుతో మంచం పట్టి మరణించాడట.

నా మిత్రుడు రంగనాయకి కృష్ణనాయర్ల కథ ఈ విధంగా చెప్పుకుపోతుంటే నాకేదో కథ చదువుతున్నట్లనిపించింది. “అది సరే, వున్నవాళ్ళని ఇక్కడే వుండనివ్వక వాళ్ళని నా దగ్గరకు ఎందుకు పంపావు?” అని అడిగాను.

“కారణం వుండే పంపాను.” అన్నాడు మిత్రుడు....చెప్పాడు;

“కృష్ణనాయర్ కి రంగనాయకంటే అమిత ఇష్టం. ఒక్కక్షణంకూడా విడిచిపెట్టి వుండలేడు. కాని వాడికి రంగనాయకి అంటే యెంతఇష్టమో అంత అనుమానంకూడా. రంగనాయకికి ఇక్కడ ఒక మేనమామ ఉన్నాడు. రంగనాయకితండ్రి, రంగనాయకికి అతనికీ పెళ్ళి చేద్దాం అనుకునేవాడట. అతన్నిచూస్తే చాలు కృష్ణనాయర్ కి యెక్కడలేని కోపం, రంగనాయకిమీద యెక్కడలేని అనుమానం వచ్చేది. అంతప్రేమించినవాడూ ఒక్కసారి రాక్షసుడుగా తయారయ్యేవాడు. దాన్ని గొడ్డును బాదినట్టు బాదేవాడు. ఇక్కడనుంచి వెళ్ళబోయేముందు రంగనాయకికి గర్భిణీ వచ్చింది. కృష్ణనాయర్ కి ఎందుకు అనుమానం వచ్చిందో ఏమో, ఆ గర్భిణీకి రంగనాయకి మేనమామ కారణం అని అనుమానం వచ్చింది. ఇకచూడు రాక్షసత్వం. అది గర్భిణీ పోగొట్టుకునేవరకూ వాడి పెట్టిన హింస, హింసకాదు. ఇవన్నీ చూడలేక ఎక్కడికన్నా దూరంగా పంపితేనన్నా సరిగ్గా వుంటాడేమోనని నీ దగ్గరకు పంపాను.” అన్నాడు మిత్రుడు.

నా మనస్సు ఈ విషయాలు వినటంతో వ్యాకులత పడింది. “ఎందుకింత రగడ? ఈ విధంగా జీవించేబదులు పోనీ ఎవ్వరిదార్న వాళ్ళు పోగూడదూ?” అన్నాను.

“నే నామాట చెప్పాను. కాని వాళ్ళకి ఒకళ్ళ నొకళ్ళు విడిచిపెట్టటం ఏమాత్రం ఇష్టంలేదు. “దాన్నట్లాచంపేబదులు విడిచిపెట్టి పోరాదట్రా?” అని నేనొకసారి అంటే వాడు చూసినచూపు నాకు చచ్చేదాకా మరపురాదు.” అన్నాడు మిత్రుడు.

తరువాత మాటలు మళ్ళీ సినిమాలమీదకు జరిగినై. ఆ యాక్టరు తాను నటించే చిత్రాలూ, తాను ఒక్కొక్క చిత్రంలోచూపే ప్రతిభా Character acting తన సొమ్ము ఏ విధంగా అయిందో అదీ, చెపుతూ వుంటే వింటూ కూర్చున్నాను. చివరికి మిత్రుని బలవంతాన ఆపూట అతనితో భోజనంచేసి రాత్రి మెయిలుకి ఇంటికి బయలుదేరాను. ఇంటికి తిరిగి వొచ్చిం తర్వాత, మద్రాసులో నా మిత్రునివల్ల విన్న విషయాలు నాభార్యకు చెప్పాలని వొకటి రెండుసార్లు అనుకున్నాను. కాని పనులు తొందర వల్లగానీ, చెప్పి ఆబిడమనస్సు కష్టపెట్టటం ఎందుకు అని గానీ మొత్తానికి ఏ కారణంవల్ల అయితేనేం చెప్పలేదు.

*          *          *          *

నేనా రోజుఆఫీసులో కాగితాలు చూచుకుంటూవుంటే ఒక ముసలివాడు నాగదిలోకి వచ్చాడు. వాడు మా యింటిముందు ఉండే జట్కాబళ్ళవాళ్ళల్లో ఒకడవి నేనుచూచీచూడగానే గుర్తుపట్టాను. వాడిక్కడికి ఎందుకువచ్చాడా? అని ఆశ్చర్య పడ్డాను.

“ఏమిటి?” అని అడిగాను.

“పనివుంది బాబూ” ఎన్నడూ ఆఫీసుల్లో అడుగుపెట్టినవాడు కాదేమో, భయపడుతూ, నీళ్ళు నములుతూ చెప్పాడు. “ఏం పని?”

“అదేబాబూ! కిట్టన్నాయ రున్నాడే, వాడి సంగతి” అన్నాడు.

ముసలివాని వాలకాన్నిబట్టి మొత్తానికి యేదో పెద్దచిక్కే వచ్చిం దనుకున్నాను.

“వాణ్ణి మీరు అదుపులో పెట్టకపోతే లాభంలేదు బాబూ” అన్నాడు.

"అసలు యేం జరిగిందో చెప్పు"

"చెపుదామనేవచ్చా బాబూ. దొరలకుముందుగా మనవి చేసుకోపోతే ముసలి ముండాకొడకా అప్పుడేమెందుకు చెప్పలేదు అంటారు. ఈకిట్టన్నా యరు పాపం ఆ బిడ్డనిబాదే బాదుడికి వాడకట్టువాళ్ళం అక్కడ కాపరాలు చెయ్యలేకుండా ఉన్నాంబాబూ? మీలాంటి దొరలు పిలిపించి కూకలు వెయ్యక పోతే ఆ బిడ్డని బ్రతకనియ్యడు. రాత్రికి రాత్రి డొక్కలో ఒక్కపోటు పొడిచాడట బిడ్డ అపట్నే నేల కూలింది. అయిపోయిందే, అనుకున్నాం బాబూ. పాపుగటంకి అట్లట్లా లేదుకుంది."

నేను నా ఆందోళన ముసలివానికి కనపడనివ్వకుండా "దానితో బాగానే ఉంటాడే" అన్నాను.

"ఉన్నప్పుడు బాగానే వుంటాడు బాబూ! వుండి వుండి పుట్టుకొస్తుంది పైగా బిడ్డకిప్పుడు నెలతప్పింది. ఈ గర్భిణీ కూడా నిలవనివ్వడని, నా ముసలిదాన్తో చెప్పుకొని ఏమి అపసోపాలు పడింది!!" తను కన్నీరు తుడుచుకోవటం మొదలుపెట్టాడు ముసలివాడు. నేను చూడలేకపోయాను. "నేను కనుక్కుంటాలే," అని చెప్పి ముందు ముసలివాణ్ని పంపాను. "మద్రాసులో దాని మేనమామ మీద అనుమానపడి, హింసిస్తే హింసిం చాడు. ఇక్కడికి వచ్చికూడా ఇదేమిటి?" అనుకున్నాను. వెంటనే "ఎక్క డైతేనేం అనుమానపడేవాడికి కారణాలే దొరక్కపోతయ్యా" అనుకున్నాను. ఏదైనా ఈ వ్యవహారం అంతు కనుక్కొని వీలైతే వాళ్ళ కుటుంబాన్ని ఒకదారికి తీసుకురావాలని మనస్సులో నిశ్చయించుకున్నాను.

పని యెక్కువవుండి ఆ సాయంకాలం చీకటి పడిగాని ఆఫీసునుంచి ఇంటికి వెళ్ళలేకపోయాను. నేను వెళ్ళేటప్పటికి రంగనాయకి అప్పుడే పిల్లల్ని పార్కునుంచి తీసుకు వచ్చినట్లు ఉంది. వాళ్ళని పెట్టుకొని నా భార్యతో ఏవో మాటలు చెపుతూ కూర్చుంది. నన్ను చూచి సిగ్గుపడి లేచి నుంచుంది.

నేను అంతకుముందు రంగనాయకిని ఎపుడూ పరీక్షగా చూడలేదు.

నిగనిగలాడే నలుపు. పూరేకులవంటి కళ్ళు, అంగసౌష్టవం కలిగిన మనిషి. పెద్ద అందమైన మనిషని చెప్పలేంగాని, ఆకర్షవంతమైన మనిషి మాత్రం అవును. దాన్ని చూడగానే ముసలివాడు చెప్పినమాటలు ప్రతిధ్వనించినై. "ఏంరంగనాయకి బాగున్నావా?" అని అడిగాను.

అది తలవంచుకొని నవ్వుకుంటూ "తమరి దయవల్ల" అన్నది.

"వాడు ఉద్యోగం బాగా చేస్తున్నాడా?"

"ఆఁ" తలవంచుకొని జవాబు చెప్పింది.

"నిన్ను సరిగ్గా చూస్తున్నాడా?"

"బాగానే చూస్తున్నాడు—"

"ఏమో మొండివాడు ఉండివుండి వాడికి పిచ్చిరేగుతూ ఉంటుంది జాగ్రత్త. ఏదన్నా జరిగితే అమ్మకు చెపుతూ వుండు" అన్నాను.

ఈ మాటలకు నా భార్య నవ్వింది. నవ్వి "వాడు ఎక్కడైనా మొండి వాడేమో గాని దానిదగ్గర కాదు....దానికి వాడు లోకువే....కడవంత గుమ్మడి కాయా, కత్తిపీటకు లోకువే అని. దాన్ని వాడు క్రింద నడవనిస్తున్నాడా? కాసేపు కనపడకపోతే చాలు "అది వచ్చిందా?" అంటూ పరుగెత్తుకుంటూ వస్తాడు" అన్నది.

రంగనాయకి ఇంకా తలవంచుకొని, కాలితో నేలరాస్తూ నుంచొని ఉంది. ఇక సంభాషణ సాగలేదు. నేను ముందు గదిలోకి వెళ్దామని బయలు దేరాను. వసారాలో అప్పుడే వస్తున్న క్రిష్ణనాయర్ కనుపించాడు....

"ఏంరా, ఏమిటి సంగతులు?"

"ఏం లేవు సార్."

"ఏం ఇటొచ్చావ్?"

"అది వొచ్చిందేమో తీసుకుపోదామని"

"ఇక్కడ బాగుందా?"

"బాగుంది సార్."

ఇంతలోకి వాడి మాట విని బయటకు వచ్చింది. ఇద్దరూ కలసి బయటకు వెళ్ళారు.

నాకు అర్థం కాలేదు. వాళ్ళ వైఖరిచూస్తే ముసలివాడు చెప్పిన మాటలుగానీ, నా మిత్రుడు చెప్పిన మాటలుగానీ సమ్మదగ్గవిగా కనుపించలేదు. కనిపెట్టి చూస్తూ ఉండమని నాభార్యకు చెప్పాలని నిశ్చయించుకొన్నాను. కాని నా స్నేహితుడికి ఒంటికి సీరియస్‌గా ఉందని వైరు రావటంవల్ల ఆ రాత్రే నేను బయలుదేరి వైజాగ్ వెళ్ళవలసి వచ్చివెళ్ళాను.

* * * *

నేను వెళ్ళేటప్పటికే నా స్నేహితుడు మన స్మారకంలో లేడు. నేను వెళ్ళిన కాసేపటికి కన్ను తెరచి చూశాడు. ఎకాయెకి నన్నే చూశాడు. గుర్తుపట్టాడు. వచ్చి కూర్చోమన్నట్లుగా సంజ్ఞ చేశాడు. నేను వెళ్ళి ప్రక్కన కూర్చున్నాను. నా చెయ్యి మీద చెయ్యివేశాడు. ఏదో చెప్పబోయాడు. అంతే. చెప్పబోయిందేదో అతనిలోనే వుండిపోయింది. అదేమిటో శాశ్వతంగా ఎవ్వరికీ తెలియదు. అంతా వొక్కసారి గొల్లుమన్నారు. తల్లి "నీ కోసమే ప్రాణాలు బిగబట్టుకు కూచున్నాడు బాబూ" అని బోరున ఏడ్చింది, నన్ను కావిలించుకొని. ఇక అతని భార్య దురవస్థ ఎవ్వరు వర్ణించగలరు? వొక్క క్షణంలో అంతా మారిపోయింది ఆమెకు....ఆమెకూ ప్రపంచానికీ ఏర్పడిన సంబంధాలన్నీ, వొక్క క్షణంలో తుత్తునియలైనై ....చావు ఎంత అన్యాయమైన సృష్టి !! మానవుని గర్వాన్ని అణచడానికిగాను, భగవంతుడు ఈ ఉపాయాన్ని కనిపెట్టాడా, అనిపిస్తుంది, చూస్తూ వుంటే.

దహన సంస్కారాలయ్యేదాకా వుండి నేను ఇంటికి తిరిగివచ్చాను. ఇంటిముందు యధాప్రకారం రోడ్డుకి రెండు ప్రక్కలా గుర్రపుబళ్ళు నిలబెట్టబడి వుంది. నేను గుర్రపుబండి దిగగానే 'అయ్య వచ్చాడు. బండి

అద్దం తియ్యవోయ్' అని ఒక బండివాడు ఇంకొకణ్ణి కేకవేశాడు, బళ్ళన్నీ తియ్యమంటారేమో అనే భయంతో. ఈ విధంగా నన్ను మర్యాదచెయ్యటం వాకిటికి ఎదురుగా పెట్టటం, మాత్రం నేను సహించనని నాకే తెలియ జెయ్యటం వాళ్ళకి మామూలే! నేను బండిదిగి లోపలకు వెళ్ళాను. నేను వెళ్ళటం చూచి ఇదివరకు నాకు క్రిష్టనాయర్‌ని గురించిచెప్పిన ముసలివాడు నాతోపాటు లోపలకు వొచ్చాడు.

"అమ్మగారు ఇంటిలో లేరు బాబూ!" అన్నాడు....

"ఎక్కడికి వెళ్ళింది?"

"ఆస్పత్రికి వెళ్ళింది బాబూ!"

నేను ముసలివాని ముఖంలోకి పరీక్షగా చూశాను. అతని కళ్ళు చెమ్మగిల్లినై. "రంగనాయకి అపాయంలో వుందని తెలిసి చూసి రావటానికి అమ్మగారు వెళ్ళారు బాబూ" అన్నాడు.

అతని మనస్సులో నాకు చెప్పవలసిన విషయం చాలా వుందని అతని చూపులనుబట్టి నేను గ్రహించాను. వసారాలో వున్న బల్లమీద చతికిలబడ్డాను.

"ఏం జరిగింది!" అని అడిగాను. నా కంఠం రుద్ధం అయింది.

అతను కంటతడి వొత్తుకుంటూ చెప్పాడు.

"నిన్న రాత్రి బాబూ! ఎక్కడివాళ్ళం అక్కడ నిద్రపోతున్నాం. వుండి వుండి పెద్ద కేకలు వినబడితే నేను ఉలిక్కిపడి లేచా. అవి ఆ బిడ్డ కేకలే. నేను వాళ్ళ ఇంటికివెళ్ళి చూద్దునుగదా....ఏం చెప్పను బాబూ, ఆ కిష్టన్నాయరు "వాడు ఒచ్చి పోతున్నాడా లేదా? చెప్పు.... "అని ఆ బిడ్డ డొక్కలో గుద్దుతున్నాడు. నేను జొరబడ్డాను. కోపం పట్టలేకపోయాను బాబూ. ఆ కిష్టనాయర్ని ఎన్ని దెబ్బలు వేశానో నాకే తెలియదు బాబూ. కాని ఏం చేసి యేంలాభం? అప్పటికే ఆ బిడ్డ స్పృహతప్పి పడివుంది. వెంటనే పదిమందిమీ పట్టి ఆస్పత్రిలో జేర్పించాము. గర్భం పోయిందట

బాబూ! ఇంతవరకు ఆ పోయిన స్పృహ మళ్ళీరాలేదు.ఎన్ని మందులిచ్చినా కూడా రక్తాన్ని ఆపలేకపోయారు బాబూ...." అని యేక ధారగా కన్నీరు కార్చటం మొదలుపెట్టాడు ముసలివాడు.

"ఇక్కడెవ్వరిమీదన్నా వాడికి అనుమానంవుందా?"

"లేదట బాబూ! వొట్టప్పుడు బాగానే వుంటాడట. బిడ్డకి నెలతప్పితే చాలు, అచ్చగా రాకాసే అవుతాడట. మరి అదేం చోద్యమో బాబూ! "ఎవ్వరు? ఎవ్వరో చెప్పు? వాడు వచ్చి వెళ్తున్నాడా?" ఇవే మాటలట బాబూ...."

నాకేమీ పాలుపోలేదు. ఇంతలో నాభార్య వచ్చింది. కళ్ళల్లో నీరు కళ్ళల్లో కుక్కుకుని బండి దిగింది. నన్ను చూసి "అయిపోయింది" అన్నది ఇక కన్నీరు ఆపుకోలేకపోయింది. "పోయేటప్పుడు వొక్కక్షణం తెలివి వచ్చింది.నాకు నమస్కరించింది. అయ్యగారి దగ్గర సెలవు తీసుకొన్నానని చెప్పండి అన్నది" అని ఏకధారగా కన్నీరు కార్చింది. ముసలివాడు, "పోయిందీ బిడ్డ?" అని ఒకటే ఏడుపు.

"వాడున్నాడా?" అని అడిగాను.

"పాపం! వాడి ఏడుపు చెప్పలేం. మొహంమీద గుడ్డ కప్పుకొని దొర్లి దొర్లి యేడుస్తున్నాడు. నేను వెళ్ళగానే "దాన్ని ఎట్టాగో బతికించండి అమ్మగారూ" అని కాళ్ళకు చుట్టవేసుకొని వదల్లేదు. పాపం ఎవ్వరం యేం చేస్తాం?"

నా భార్యకు సంగతులన్నీ తెలియలేదని ఆమె మాటలవల్ల నేను గ్రహించాను. ఇప్పుడు మాత్రం యేం ప్రయోజనం! తెలిసి బాధపడటం తంటే, అనుకొని మెదలకుండా వూరుకున్నాను.